18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 4 అక్టోబర్ 2024 | పేజీలు 10

## శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



**తిరుమల, మేజర్‌న్యూస్:**

తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన విష్వక్సేనుల వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరే గింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు.

వివరాలు 8లో

# సనాతన ధర్మానికి అవమానం

- హైందవ ధర్మాన్ని కాపాడటానికి ఇక్కడికి వచ్చా..
- అన్ని మతాలను గౌరవించడం ధర్మం
- శ్రీవారి ప్రసాదాలలో అపచారం చోటుచేసుకుంది
- వైసీపీ హయాంలో శ్రీరాముని విగ్రహ తల నరికేశారు
- కల్తీ నెయ్యి ప్రసాదాలు శ్రీవారికి నైవేద్యంగా పెట్టారు
- ఈసారి ఎన్నికలు జరిపితే వైసీపీని ఒక్క సీటుకు పరిమితం చేద్దాం
- సనాతన ధర్మ పరిరక్షణ కోసం చట్టం అవసరం
- వారాహి సభలో డిక్లరేషన్ ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

సనాతన ధర్మాన్ని అడుగడుగునా అవమానిస్తూ.. హైందవ ధర్మాన్ని అవమానిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రాయశ్చిత్త దీక్ష విరమించి గురువారం రాత్రి పూలే విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన వారాహి సభను పాల్గొన్నారు ఈ సభలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తో కలిసి వారాహి సభలో మాట్లాడారు. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తారని ఎవరో చెబితే వారితో గొడవపడ్డానని, సగటు భారతీయుడుగా హైందవ సనాతన ధర్మాన్ని కాపాడే వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పవన్ చెప్పారు. శ్రీవారి పాదాల సాక్షిగా చెబుతున్న ఇలాంటి రోజు రాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఏర్పడడానికి ప్రధాన కారణం వైసీపీ నేతలే అన్నారు. సనాతన ధర్మాన్ని అవమానం చేస్తున్నారని గతంలో నిర్వహించిన వారాహి సభలోనే చెప్పానని కానీ ఎవరు వినిపించుకోలేదన్నారు. దౌర్భాగ్యమేమిటంటే సనాతన ధర్మానికి గౌరవం ఇవ్వలేదని మండిపడ్డారు. అన్ని మతాలను గౌరవిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపిం చేదే సనాతన ధర్మం అన్నారు. వసుదైక కుటుంబంలా ఉండాలనుకునేది సనాతన ధర్మమని చెప్పారు. శ్రీవారి ప్రసాదంలో అపచారం చోటుచేసుకుందని, నేను దీక్ష చేస్తే కొంతమంది అసహ్యం వ్యక్తం చేశారని సనాతన ధర్మాన్ని పాటిస్తే అవహేళన చేస్తారని మండిపడ్డారు. ధర్మా న్ని పట్టుకుని నిలబడే వ్యక్తిని నేను కాబట్టి నా కూతురికి తిరుమలలో తీసుకువెళ్లి డిక్లరేషన్‌పై సంతకం పెట్టించానన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో అనేక హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని, రాముని విగ్రహం తల నరికేసారని చెప్పారు. కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డు ప్రసాదాలు శ్రీవారికి నైవేద్యంగా పెట్టారని, అదే ప్రసాదలను లక్ష తయారు చేసి అయోధ్య రామ మందిరానికి పంపి రామ ప్రతిష్టను సనాతన ధర్మ ప్రతిష్టను సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మా మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. శ్రీవారి లడ్డుపై రాహుల్ గాంధీ వాక్యాలు మరింత బాధించాయని, బాధ కలిగితే బాధపడడం కూడా తప్పు రాహుల్ అన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ లడ్డుపై ఎందుకలా మాట్లాడారో అర్థం కాలేదు అన్నారు. ముస్లిం మతం గురించి మాట్లాడితే వెంటనే శిక్షలు ఉంటాయని,

మిగతా 2లో

## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### కాన్వాయ్ రిహార్సల్ నిర్వహణ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తంపున పట్టు వస్త్రాలు సమర్పించుటకు శుక్రవారం సాయంత్రం తిరుమల పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారు. జిల్లా పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టింది. రేణిగుంట విమానాశ్రయంలో వాహన శ్రేణి, పోలీస్ అధికారులు, డ్రైవర్లతో పాటించవలసిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుండి తిరుమలకు రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుమల శ్రీవారి ఆలయం వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల ఘాట్ రోడ్డు, శ్రీవారి ఆలయం పరిసరాలలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఇంటెలిజెన్స్

మిగతా 2లో



## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అంకురార్పణకు హాజరైన చెవిరెడ్డి దంపతులు



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:**

తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు గురువారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఆలయంలో జరిగిన అంకురార్పణం సందర్భంగా తెల్లవారు జామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి, కొలువు, పంచాంగ శ్రవణం, మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. పుణ్యాహ వచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం వైఖానస ఆగమోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని జరిగిన అంకురార్పణ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డిలక్ష్మీ దంపతులు హాజరై పూజాదికాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పర్యవేక్షణకు శ్రీవారి సర్వసేనాధిపతి విష్వక్సేనుడు తిరుచ్చివాహనంపై గ్రామంలో ఊరేగారు.

**అంకురార్పణ విశిష్టత...** వైఖానస ఆగమంలో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. విత్తనాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందడమే అంకురార్పణ ఘట్టం ఉద్దేశం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే సూర్యుడు అస్తమించిన తరువాతే అంకురార్పణ నిర్వహిస్తారు. జ్యోతిష శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం చంద్రుడిని సస్యకారక అంటారు. ఈ కారణంగా పగటివేళ అంకురాలను ఆరోపింపచేయడం తగదు. సాయంత్రం వేళ మంచి ముహూర్తంలో అంకురార్పణక్రతువు నిర్వహిస్తారు. అంకురార్పణలో పలు రకాల పవిత్ర విత్తనాలు నాటడం తెలిసిందే. అంకురార్పణంలో నాటే విత్తనాల బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు గొప్పగా నిర్వహించబడతాయని భక్తుల విశ్వాసం.

**అంకురార్పణ క్రతువు జరిగేది ఇలా...** విత్తనాలు నాటేందుకు పాలికలుఅనే మట్టి కుండలను వినియోగిస్తారు. యాగశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అత్రి అనే మహర్షి

మిగతా 2లో

## ప్రత్యేక ఆకర్షణగా రూపు దిద్దుకుంటున్న అయోధ్య రాముడి సైకత శిల్పం



వివరాలు 5లో

## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)



అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రతి ప్రాంతంలో సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు ఇస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయ పరిసరాలలో టీటీడీ ఈవో శ్యామలరావు ఐఏఎస్., అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఐఏఎస్., వారితో కలసి జిల్లా ఎస్పీ రిహార్సల్ నిర్వహించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సి.యం. పర్యటనకు అన్ని కోణాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగభూషణరావు నేర విభాగం, డీఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు, ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.




## దోమల లార్వాలు వృద్ధి చెందకుండా చర్యలు : కమిషనర్

**తిరుపతి, మేజర్‌న్యూస్:** వర్షాలకు నగరంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో అక్కారంపల్లి, కొర్లగుంట, తదితర ప్రాంతాల్లో మురునీటి కాలువలను పరిశీలించి ఆయిల్ బాల్స్ వేయించే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడ నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెద్ద డ్రైనేజి కాలువల్లో చెత్త తొలగించడం వలన వర్షపు నీరు కొంతమేర సజావుగా వెళుతున్నాయని అన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి వస్తున్నాయని అన్నారు. అవి కూడా రాకుండ ఇంజినీరింగ్ అధికారులు, హెల్త్ అధికారులు కలసి చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజు కాలువల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు పనులు చెపట్టాలని అన్నారు. పాడైన డ్రైనేజి కాలువలకు మరమ్మత్తులు చేపట్టెందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్కారంపల్లి చివర మురుగునీరు ఆగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, సర్వేయర్ కోటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



## సనాతన ధర్మానికి అవమానం

(మొదటిపేజీ తరువాయి)



హిందువు దేవాలయాల దేవుళ్ళు కించపరుస్తూ మాట్లాడితే శిక్షలు లేవా అని ప్రశ్నించారు. సమాజంలో ఐక్యత లేకపోవడంతోనే హిందూ దేవుళ్లకు అవమానం చోటు చేసుకుంటున్నాయి. శ్రీరాముడు హిందువుల అందరి దైవం, సనాతన ధర్మానికి రంగు వివక్షత లేదన్నారు. మనలో వీరత్వం చచ్చిపోయింది..ధైర్యం మనలో చచ్చిపోయింది. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామంటే చేతులు కట్టుకొని కూర్చోలేము కదా. సనాతన ధర్మాన్ని పాటిస్తూ దేశమంతా తిరిగి భిన్నత్వంలో ఏకత్వాన్ని తిరిగి ప్రధాని మళ్ళీ తీసుకొచ్చారు. సనాతన ధర్మంపై దాడి జరిగితే ఎందుకు స్పందించడం లేదు. నాకు భయం లేదు అందుకే నేను మాట్లాడుతున్నాను. మీలో కూడా మార్పు వచ్చి సనాతన ధర్మంపై ముందుకు వెళ్లాలన్నారు. అల్లా క్రైస్తవ మతం గురించి మాట్లాడితే తగలబెట్టేస్తారా.? ఎవరైనా సరే మర్యాద ఇచ్చి మర్యాద తీసుకోవాలని తెలియజేశారు. అహంకారంతో కొట్టుకునే వారికి కచ్చితంగా బుద్ధి చెబుతామన్నారు. జరిగిన సంఘటనను తెలియజేసే మే తప్ప మేము దాడి చేసేందుకు రాలేదు. మా ఇబ్బందు లను మాత్రమే తెలియజేస్తున్నాం. ఈసారి ఎన్నికల జరిగితే వైసిపికి ఒక్క సీటుకే పరిమితం చేయాలని ప్రజలను కోరారు. టీటీడీ ఛైర్మన్గా భూమన కరుణాకర్ రెడ్డి చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కాదని, కర్పూరం చేతిలో వెలిగించినంత మాత్రాన జనం నమ్మే పరిస్థితుల్లో లేరని, భూమన కరుణాకర్ రెడ్డి ఇక నీ నాటకాలు ఆపు చాలు అన్నారు. వైవి.సుబ్బారెడ్డి ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా ఏకంగా న్యాయమూర్తులని బెదిరించే వ్యక్తి అన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు జగన్ పై మోపిన కేసులు వివరాలను చదివి వినిపించారు. అనంతరం సభలో వారాహి డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఏ మతానికి, ఏ ధర్మానికి భంగం వాటిల్లిన ఒకేలా స్పందించే విధంగా లౌకిక వాదాన్ని ప్రకటించాలన్నారు.



సనాతన ధర్మ పరిరక్షణ కోసం అవిశ్వాసానికి భంగం కలిగించే చర్యలు అరికట్టడానికి దేశం మొత్తం అమలయ్యేలా ఒక బలమైన చట్టం తీసుకురావా లన్నారు. ఆ చట్టాన్ని తక్షణమే అమలులోకి తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆ చట్టాన్ని అమలు చేసేలా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు కావాలని కోరారు. ఆ బోర్డుకు ప్రతిఏటా నిధులు కేటాయించి ఆలయా లలో నిత్యం జరిగే నైవేద్యాలు, ప్రసాదాలకు విని యోగించే వస్తువుల స్వచ్ఛతను ధృవీకరించే విధా నాన్ని అమలు చేయాలన్నారు. ఆలయాలు ఆధ్యా త్మిక కేంద్రాలే కాదు విద్య, ఆర్థిక, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోవాలని తెలియజేశారు.

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

(మొదటిపేజీ తరువాయి)

తన 'సముర్తార్చన అధికరణ' అనే గ్రంథంలో అంకురార్పణ క్రమాన్ని రచించాడు. అంకురార్పణ జరిగే రోజు మధ్యాహ్నం వేళ విత్తనాలను కొత్త పాత్రలో తీసుకున్న నీటిలో నానబెడతారు. అంకురార్పణ నిర్వహించే ప్రదేశాన్ని ఆవు పేడతో అలంకరిస్తారు. ఇక్కడ బ్రహ్మపీఠాన్ని ఏర్పాటుచేస్తారు. ఆ తరువాత మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానిస్తారు. ఆ తరువాత భూమాతను ప్రార్థిస్తూ పాలికలను మట్టితో నింపుతారు. చంద్రుడిని ప్రార్థిస్తూ అందులో విత్తనాలు చల్లి నీరు పోస్తారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు. ఉత్సవాలు జరిగుతున్నంత కాలం ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తారు. ఈ మొత్తం కార్యక్రమం వేదమంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ సాగుతుంది.

**నేడు ధ్వజారోహణం...** ధ్వజారోహణంతో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి 7 గంటల మధ్య కన్యాలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత రాత్రి 7 నుండి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల కారణంగా ఆలయంలో జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు, ప్రత్యేక పూజలను రద్దు చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆర్డీఓలను, తహశీల్దార్లను ఆదే శించారు. గురువారం జిల్లాసచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ రైట్స్ లకు సంబంధించిన రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్షించారు. జేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్వహించడం జరుగుతున్నదని, సమస్య పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజల అర్జీల పరిష్కారం నిమిత్తం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు ఎండార్స్మెంట్ ఇవ్వాలని, అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కారం చేయాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్ళ కుండా చర్యలు చేపట్టాలన్నారు.

అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు పరిష్కారం కాని సమస్యలకు సంబంధించి పరిష్కారం చేయకపోవ డానికి గల కారణాలను సవివరంగా అర్జీదారునికి వివ రిస్తూ ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. దీనితో పాటు రెవెన్యూ సంబంధిత అంశాలపై ముఖ్యమంత్రి కార్యాల యం, మంత్రుల కార్యాలయం నుండి అందిన అర్జీల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రీ హోల్డ్ రైట్స్ భూములకు సంబంధించిన రికార్డు లను సిసిఎల్ఏ నందు అందిన ప్రొ ఫార్మా మేరకు తహశీల్దార్‌లు శుక్రవారంకి ఆర్‌డిఓలకు అందజేయాలని, ఆర్‌డిఓలు క్రోడీకరించి నివేదికను శనివారంకి కలెక్టరేట్‌కు అందజేయాలని సూచించారు. ఈ విషయంలో తహశీల్దార్లు రికార్డుల ను పూర్తిగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. నేషనల్ హైవేకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించా లన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు డిఆర్ఓ బి.పుల్లయ్య, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



## మంత్రి నారా లోకేష్‌తో గురువారెడ్డి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని ఉండవల్లి వారి స్వగృహంలో శ్రీకాళహస్తి తెలుగుదేశం నేత రెడ్డి వారి గురవారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన వడ్డెర సంఘ నాయకులు



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** రాయచోటి మాజీ మున్సిపల్ చైర్మన్ వీరభద్రయ్య విగ్రహ ప్రతిష్టకు వడ్డిపల్లి గ్రామానికి విచ్చేసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డిని పుంగనూరు నియోజకవర్గం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షులు రమేష్, చౌడేపల్లి చిన్నరెడ్డప్ప, నరసాపురం రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## హాకీ పోటీలకు నారాయణ పాఠశాల విద్యార్థి ఎంపిక

**కుప్పం, మేజర్‌న్యూస్:** జిల్లా స్థాయిలో 2024 అక్టోబర్ 1 వ తేదీన మదనపల్లిలో జరిగిన హాకీ క్రీడలో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇందులో భాగంగా 10వ తరగతి చదువుతున్న- సిద్దార్థ్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు ఎంపికైనట్లు పీఇటి విజయ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని నారాయణ పాఠశాల



డిజిఎం కొండలరావు, చిత్తూరు జిల్లా నారాయణ పాఠశాల ఏజిఎం ఫణి కుమార్, ఆర్ఐ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జోనల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఏజిఎం బాలకృష్ణ,వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఎఓ నరేష్, ఎడి ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి అవతారంలో బంగారమ్మ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన గ్రామ దేవత బంగారం ఆలయం, డైట్ సమీపంలో ఉన్న అంకాల పరమేశ్వరి ఆలయం, స్కంద పుష్కర్ణి వద్ద వెలసిన రాజ రాజేశ్వరి ఆలయం, డిఎం పురం పంచాయతీ పాత దేరాకండిగా గ్రామం వద్ద వెలిసిన నేనేరమ్మ ఆలయంలో, రాజ బంధువుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయాల్లో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద బాల త్రిపుర సుందరి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించినారు. ఉభయ దాతలుగా ఉదయ్ కుమార్, నంద కుమార్, సుబ్రహ్మణ్యం రాజు, రామచంద్ర యాదవ్, రేఖ ధనశేఖర్ యాదవ్, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు, ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, ప్రసాద్, చంద్రశేఖర్ పిళ్ళై, మంజునాథ్ వర్మ, జగదీష్, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కేపీ.అగ్రహారం పంచాయతీలో స్వచాత హి సేవ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలం కేపీ.అగ్రహారం పంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులు వీధులు శుభ్రం చేయడం, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయడం, దోమల నివారణకు సాగించడం ఐదు పంచాయతీల నుంచి గ్రీన్ అంబాసిడర్లు, పారిశుద్ధి కార్మికులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడే గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించడానికి పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రా రెడ్డి విచ్చేయచున్నట్లు కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టి మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రతి వార్డును స్వయంగా పరిశీలించి రోగులకు ఎటువంటి మెరుగైన వైద్య సదుపాయాలు అందజేస్తున్నారో డాక్టర్లను, రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో బ్లడ్‌క్యాంప్, ల్యాబ్‌లను పరిశీలించి ఆసుపత్రికి ఎటువంటి సదుపాయాలు కావాలో డాక్టర్లు అడిగి తెలుసుకుని, వాటిని వెంటనే నెరవేర్చే దిశగా అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రిని తనిఖీలు నిర్వహించామని ఇక్కడ డాక్టర్లు పరిశుభ్రమైన పరిసరాలతో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందజేస్తున్నందుకు వారికి అభినందనలు తెలియజేయమన్నారు. ఇక ఈ ఆసుపత్రికి కావాల్సిన మెరుగైన సదుపాయాలను ఉన్నత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించమని పురపాలక సంఘం అధికారులకు ఆదేశాలు జారీ చేశామని. రేపు ఈ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థ పదార్థాలను పురపాలక సంఘం అధికారులు తొలగిస్తారని తెలియజేశారు. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో సంప్రదించి డయాలసిస్ సెంటర్‌లో రోగులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించే విధంగా కార్యాచరణ చేపడ తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శక్తి ఆలయాలలో దసరా సందడి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో శ్రీకాళహస్తి శక్తి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారి ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష అభిషేకలు. పూజలు చేపట్టి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తి ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. శక్తి స్వరూపిణి గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి విశేష అభిషేకాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో పిండి దీపాలు వెలిగించి సంప్రదాయ పద్ధతిలో పూజలు జరిపారు. భవాని మాల దీక్ష చేపట్టిన భక్తులు అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు జరుపుకున్నారు. భాస్కర్ పేట చాముండేశ్వరి దేవి, నల్ల గంగమ్మ దేవి, కొత్తపేట సీతాలాంబ దేవి, పోన్నాలమ్మ వేడంలోని శ్రీదక్షిణ కాళికామాత దేవి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటూ పూజలు జరుపుకుంటున్నారు. తొలిరోజే అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ముత్యాలమ్మ ఆలయ అర్చకులు పూజారి గోపి మాట్లాడుతూ గురువారం నుంచి దసరా వేడుకలు పురస్కరించుకొని అమ్మవారి నవరాత్రులలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, అమ్మవారిని కొలువు తీర్చి భక్తులు దర్శన భాగ్యం కలిగిస్తామని, ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటే వారికి సకలసౌభాగ్యాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయన్నారు.



## ఆప్తీయ కుటుంబానికి రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పరామర్శ

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో కిడ్నాప్ అయ్యిచనిపోయిన చిన్నారి కుటుంబాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం గురువారం పరామర్శించారు. అనంతరం చిన్నారి చనిపోయిన సంఘటనస్థలాన్ని పరిశీలించారు. తరువాత పుంగనూరు పోలీస్ స్టేషన్ చేరుకొని డీఎస్పీ ప్రభాకర్, సాయినాథ్ లతో బాలిక మృతికి గల కారణాలపై చర్చించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగటం చాలా దురదృష్టకరమన్నారు. ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిన వారి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కవిత, బిజెపి మహిళా అధ్యక్షురాలు మల్లికా రాణి టిడిపి నాయకులు సివిరెడ్డి, సుహేల్, మండల అధ్యక్షులు మాధవరెడ్డి ప్రసాద్ స్వామి, మోపురిమోహన్ రెడ్డి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాదరావు జయంతి

### పేదలకు బిరియాని లంచ్ బాక్స్‌లు పంపిణీ

**కోట, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా మండల కేంద్రమైన కోటలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్ రావు 68వ జయంతి వేడుకలను గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. తిరగాబత్తిన ప్రసాద్ ఆధ్వర్యంలో బల్లి దుర్గాప్రసాదరావు జయంతిని పురస్కరించుకొని ఆయన అభిమానులు బర్త్డే కేక్ కట్ చేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ తరఫున నాలుగు సార్లు గూడూరు ఎమ్మెల్యేగా బల్లి దుర్గాప్రసాద్ రావు గెలుపొందారు. అలాగే ఒక పర్యాయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తిరుపతి పార్లమెంటు సభ్యుడుగా గెలుపొందారు. కరోనా సమయంలో అనారోగ్యంతో దుర్గాప్రసాదరావు మృతి చెందారని అభిమానులు గుర్తు చేశారు. అలాగే పేదవారు సైతం ఎవరు ఫోన్ చేసినా ఏ సమయంలో నైనా ఫోన్ ఫోను ఎత్తి మాట్లాడే వ్యక్తి బలి దుర్గాప్రసాదరావుని వారు గుర్తు చేశారు. పేదల పట్ల ఉదారంగా ఉండేవారన్నారు. చిన్న పెద్ద అనే తార తమ్యం లేకుండా, కుల మత భేదాలు కూడా లేకుండా ప్రజలతో అట్టే కలిసి పోయేవారన్నారు. పేదలకు బిరియాని లంచి బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్రావు అభిమానులు ఏ.శ్రీనివాసులునాయుడు, పేట మురళి, పేట వినోద్ కుమార్, మారు శ్రీనివాసులు, పాల్ రాజ్, జోగి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# యాత్రికులకు మెరుగైన సేవలను అందించాలి

**- డ్యూటీలో ఉన్నప్పుడు పరిసర కార్యకలాపాలపై నిఘా ఉంచండి**
**- డిప్యూటేషన్ సిబ్బందికి టీటీడీ ఈఓ**

**తిరుమల, మేజర్‌న్యూస్:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు విశేష సేవలు అందించాలని, విధులను నిర్వర్తించడంతో పాటు, డిప్యూటేషన్ సిబ్బంది తమ పరిసరాలపై నిఘా ఉంచి, అప్రమత్తంగా ఉండాలని, సమస్యను పరిష్కరించడంలో ముఖ్యపాత్ర పోషించాలని టిటిడి ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల విధులకు హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి ఈఓ, అదనపు ఈఓలు మాట్లాడుతూ, శ్రీవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు పోలీసులు, జిల్లా యంత్రాంగం, డిప్యూటేషన్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అనంతరం అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, సివిఎస్‌వో శ్రీధర్‌లు కూడా గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యంగా గరుడసేవ రోజున ఉండే సమన్వయ సమస్యలు ఈసారి తలెత్తవని డిప్యుటేషన్ అధికారులకు వివిధ అంశాలపై కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీపీఆర్‌వో డాక్టర్ టి రవి, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, ఇతర ఉన్నతాధికారులు, డిప్యూటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి మురుగన్

**తిరుమల, మేజర్‌న్యూస్:** శ్రీవారి సేవలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి గురువారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరూ. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు మంత్రి మురగన్ కి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలించిన కమిషనర్ నరసింహ ప్రసాద్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** నగర శివారులోని కల్వకుంట ఎన్టీఆర్ జలాశయాన్ని గురువారం ఉదయం నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం ఎంత ఉంది? రోజుకు ఎంత నీటిని వినియోగిస్తున్నారు? ఇంకా ఎన్ని రోజులకు సరిపడే నీటి నిల్వలు ఉన్నాయనే అంశాలను పరిశీలించారు. అనంతరం జలాశయం పంప్ హౌస్ లో మోటార్లను తనిఖీ చేశారు. మోటార్ల రన్నింగ్ టైం, రికార్డులను తనిఖీ చేశారు. మోటార్లు, పంపుసెట్ల నిర్వహణ పక్కాగా చేయాలని, రిపేర్లు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. పూణేపల్లి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను తనిఖీ చేసి నీటి శుద్ధీకరణ తీరును, క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు.



## తిరుమల లడ్డూ వ్యవహారంపై విశ్వహిందూ పరిషత్ ధర్నా

**గూడూరు, మేజర్‌న్యూస్:** తిరుమల లడ్డు వ్యవహారంలో రాజకీయాలకు సంబంధం లేకుండా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం ఉదయం విశ్వహిందూ పరిషత్ కార్యాలయం నుండి టవర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా జరుగుతున్న సంఘటనలకు సత్వర పరిష్కారం చూపించాలని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మురళి రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖను వెంటనే రద్దు చేయాలని హిందూ దేవాలయాలలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుండి తొలగించాలని, తిరుమల పవిత్రతను కాపాడాలని, హిందువుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాల నుండి రాజకీయాల నుండి హిందూ దేవాలయాలను విముక్తి కలిగించి స్వామీజీలు పీఠాధిపతులచే ధర్మ పరిరక్షణ పరిషత్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



అనంతరం సబ్ కలెక్టర్ రఘువేంద్ర మీనాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చిప్పల రమణయ్య విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు హిందూ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు వీడ్కోలు

**తిరుపతి బ్యూరో మేజర్ న్యూస్:** మూడు రోజులు తిరుపతి,తిరుమల పర్యటన ముగించుకొని తిరిగి గురువారం రాత్రి 8.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయితీ రాజ్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు రేణిగుంట విమానాశ్రయం నందు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్,తిరుపతి,శ్రీకాళహస్తి నియోజకవర్గాల శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు,బొజ్జల సుధీర్ రెడ్డి,జనసేన పార్టీ నాయకులు తదితరులు సాదర వీడ్కోలు పలికారు. అంతకుముందు తిరుమల నుండి తిరుపతి చేరుకొని తిరుపతి పట్టణం లో నిర్వహించిన వారాహి సభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించి, అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానం లో విజయవాడ కు బయలుదేరి వెళ్ళారు.



## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కంకణ బట్టాచార్యులుగా గోవిందా చార్యులు



**తిరుమల మేజర్ న్యూస్:** నేటి నుంచి ప్రారంభం కానున్న తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి ఆలయంలో అంకురార్పణ వైభవంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఈ తొమ్మిది రోజులపాటు ఆలయంలోని కైంకర్యాలు స్వప్న తిరుమంజనాలు తదితర కైంకర్యాలు కంకణ భట్టాచార్యులుగా గోవిందాచార్యులు నియమితులయ్యారు.

## ప్రజల క్షేమం కోసమే నవ చండీయాగం : ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** ప్రజల క్షేమం కోసమే నవ చండీ యాగం నిర్వహించడం జరుగుతోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. గురువారం నగరం లోని సంతపేట నందు గల జిజేయం సుఖీభవ ఫంక్షన్ హాల్లో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా లోక క్షేమాన్ని కోరుకుంటూ ఉదయం 11 గంటలకు నవచండీ యాగాన్ని బాలకృష్ణ గురూజీ వారి శిష్య బృందంతో శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ట చేసి, ప్రత్యేక అలంకరణ, అర్చన పూజాది కార్యక్రమాలు నిర్వహించి కుటుంబ సమేతంగా నవచండీ యాగం మొదలు పెట్టారు. తొమ్మిది రోజులపాటు జరిగే చండీ హెూమంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గతం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు సందర్భంగా ఆయన ఆరోగ్యంగా బయటపడాలని గత దసరా శరన్నవరాత్రుల సంధర్భంగా 9 రోజల పాటు చిత్తూరు నగరంలోని బీవీ రెడ్డి కాలనీలో గల నివాసం నందు నవచండీ యాగం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఈ పూజా కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, మేయర్ అముద, డెప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కఠారి హేమలత పలువురు ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల మండలలకు చెందిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## దసరా మహెూత్సవాలు ప్రారంభం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని బజారు వీధి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం దసరా మహెూత్సవాలు గురువారం నుండి ప్రారంభమైయ్యాయి. ఉదయం కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకమండలి చైర్మన్ జూలకంటి మురళీమోహన్ గుప్త ఆధ్వర్యంలో చీదెళ్ళ లోకేశ్వరరావు, అమృతవల్లి కుమారి దంపతులు దేవస్థానం ప్రాంగణంలో పతాక ఆవిష్కరణ చేశారు. ప్రతి రోజూ సాయంత్రం వివిధ ప్రత్యేక అలంకలతో అమ్మవారు. భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు. వాసవి మహిళా మండలి సభ్యులు. వాసవి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఆకర్షణగా రూపు దిద్దుకుంటున్న అయోధ్య రాముడి సైకత శిల్పం



పురాతన కళా రూపంలో ఒకటైన సైకతా శిల్ప కళ 500 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఆకట్టుకుంటుంది. ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా గజేంద్రమోక్షం సైకతా శిల్పాన్ని రూపొందించారు. టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తిరుమల లోని కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ సైకతా శిల్పం భక్తి భావాన్ని పంచుతోంది .బెంగళూరుకు చెందినవారు ఈ సైకతా శిల్పాన్ని రూపొందించారు. టిటిడి ఉద్యానవన విభాగం 2014 శ్రీవారి బ్రహ్మోత్సవాల నుంచి ఫల పుష్ప ప్రదర్శనశాలలో సైకత శిల్పాలకు చోటు కల్పిస్తుంది .ఇప్పటివరకు శ్రీ భూ వరాహ స్వామి వైకుంఠం నుంచి శ్రీవారి ఆనంద నిలయ విమానాన్ని తీసుకువస్తున్న గరుడ్మంతుడు, మత్స్యావతారం ,వామనావతారం తదితర అవతారాలను ఈ యువతులు ఇసుకతో తీర్చిదిద్దుతారు. ఈసారి బ్రహ్మోత్సవాల్లో అయోధ్య రాముడి సైకతా శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఫల పుష్ప ప్రదర్శనశాల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఆహ్లాదం కలిగించేందుకు .టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఫల పుష్ప ప్రదర్శనశాలను సిబ్బంది ఇప్పటికే పనులను పూర్తి చేశారు. ఇక్కడ పలు దేవతామూర్తులు సెట్టింగ్లను ఏర్పాటు చేస్తున్నారు .వివిధ జాతులకు చెందిన రంగురంగుల పూల మొక్కలను ఇక్కడ సిద్ధం చేస్తున్నారు. టిటిడి ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ ప్రదర్శనశాల సిద్ధమవుతుంది.

- తిరుమల మేజర్‌న్యూస్







# అంగన్వాడీల సమస్యలు ఇంకెప్పుడు పరిష్కరిస్తారు?

**-వందరోజులవుతున్నా స్పందన లేదు**
**-ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం**
**-రాయపనేని హరికృష్ణ హెచ్చరిక**




**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు ఎన్‌డిఏ కూటమి ఇచ్చిన హామీని.. వందరోజులవుతున్న ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్టియు అనుబంధం) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాయపనేని హరికృష్ణ విమర్శించారు. బుధవారం తిరుపతి నారాయణపురంలోని ఐఎఫ్టీయు కార్యాలయంలో యూనియన్ ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు జి.భారతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ..ఈనెల 10వ తేదీ నాటికి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతుందన్నారు. మేనిఫెస్టోలో అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి మూడు నెలల సమయం చాలని ప్రకటించిన పాలకులు ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారానికి కనీసం ఆలోచన కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల జేఏసీని పిలిచి సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో అంగన్వాడీ వర్కర్లకు రూ. 11,500 వేతనం ఇస్తుంటే పక్కనే ఉన్న తెలంగాణలో రూ.13,650 వేతనం చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మినీ సెంటర్లను తక్షణ రద్దుచేసి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్వాడీల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకుంటే జేఏసీ ఆధ్వర్యంలో మరోసారి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌యాప్ ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో చర్చలు జరిగినా ఇంతవరకు ప్రధానమైన డిమాండ్లు ఏవీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.నూతన ప్రభుత్వంపై నమ్మకంతో అంగన్వాడీ వర్కర్లు ఇప్పటివరకు వేచి చూశారని మరింత ఆలస్యమైతే పోరాటాలకు నడుం బిగిస్తామన్నారు. జిల్లా అధ్యక్షురాలు జి.భారతి మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అందించే పథకాలు ఏవి కూడా వర్కర్లకు అమలు కాని దుస్థితి ఉందన్నారు.దుర్భర జీవితాలను అనుభవిస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వ పథకాలు అన్ని అమలు చేయాలని అలాగే ఇంటి స్థలాలు కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రధానంగా గత ప్రభుత్వంలో తీవ్రమైన రాజకీయ వేధింపులను అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కొని మానసిక క్షోభకు గురయ్యారని తెలిపారు.ఎన్డీఏ పాలనలో ఈ పరిస్థితి పునరావృతం కాకుండా సీఎం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.వెంకటరత్నం, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్టియు అనుబంధం) నాయకురాళ్లు శోభ, ఆర్.వెంకటరత్నం అలాగే పి.వెంకటరత్న తదితరులు పాల్గొన్నారు.

## బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీశ్రీశ్రీ ఆవుదేవర నందీశ్వరాలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కుంకుమార్చన, అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బెదిరింపులపై గ్రామస్తుల ఫిర్యాదు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన చేపల చెరువులో ఎలాంటి పంచాయతీ అనుమతులు లేకుండా చేప పిల్లలు వదలకూడదని స్థానిక సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి చిల్లకూరు, వడ్డిపాలెం గ్రామం నందు తండోరా వేయించారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వేలంపాటు పాడుకొని పంచాయతీ అనుమతులు లేకుండా మెస్‌లు కట్టి చేపపిల్లలు వదలడానికి సిద్ధమాయ్యారు. గమనించిన సర్పంచ్ అదే గ్రామానికి చెందిన రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై నాగరాజును సంప్రదించగా పంచాయతీ కార్యదర్శి పరిశీలించి అయన ఇచ్చే ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

# 12 లక్షల మంది భక్తులకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలన్నదే.. తమ లక్ష్యం

**- ఏపీఎస్ఆర్టీసీ డిపిటిఓ చెంగల్ రెడ్డి**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** నేటి నుండి 9 రోజులు పాటు(4వ తేదీ నుండి 12వ తేదీ వరకు)జరిగే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుపతి–తిరుమల మధ్య 12 లక్షల మంది భక్తులకు ప్రయాణ సౌకర్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏపీఎస్ఆర్టీసీ సన్నాహాలు చేస్తోందని సంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటిఓ) తిమ్మాడి చెంగల్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఆర్టిసి రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులపాటు ప్రత్యేక బస్సులను నడపడానికి 32 మంది అధికారులు, 200 మంది డ్రైవర్లు, 180 మంది కండక్టర్లు, 115 మంది సెక్యూరిటీ సిబ్బంది,50 మంది డ్రైవర్ శిక్షకులు, ఇతరులను ప్రత్యేకంగా అదనంగా రప్పించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య 150 బస్సులు నడపడానికి ఒప్పందం కుదిరిందని, ఈ ఒప్పందం ప్రకారం తిరుపతి నుంచి తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై,వేలూరు,కంచి, కృష్ణగిరి,తిరువన్నామలై, హొసూర్ మొదలైన ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను,అలాగే బెంగళూరుకు 50 ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందన్నారు. 8వ తేదీ జరిగే గరుడసేవ రోజున మాత్రమే తిరుపతి–తిరుమల మధ్య 2714 ట్రిప్పులను నడిపి,తద్వారా 2,50,000 మంది భక్తులను తిరుపతి నుండి తిరుమలకు అలాగే తిరుమల నుండి తిరుపతికి చేర్చడం జరుగుతుందన్నారు. గరుడ సేవ రోజున తిరుమల నుండి అలిపిరి వరకు భక్తులను తీసుకొచ్చి, అక్కడినుండి సెంట్రల్ బస్ స్టేషన్ కు, అదేవిధంగా రైల్వే స్టేషన్ వద్దకు ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా తీసుకురావడానికి ప్రత్యేకంగా 50 బస్సులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.ప్రతి బస్సును అన్ని విధాల పరీక్షించి తిరుమలకు అనుమతించడానికి అలిపిరి లింక్ బస్ స్టేషన్ నందు సుశిక్షితులైన అధికారులు, మెకానికల్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. అలాగే గరుడసేవ రోజున తిరుమలకు ద్విచక్ర వాహనాలు అనుమతించరు కాబట్టి, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రాంతాలైన ఇస్కాన్ గుడి సమీపం, భారతీయ విద్యా భవన్ వద్ద ఇద్దరు ఆర్టీసీ టికెట్ బుకింగ్ కండక్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు 30 నుండి 40 మంది బృందంగా ఏర్పడి ఎక్కడి నుంచైనా సరే ఆర్టీసి బస్సు కావాలని కోరుకుంటే ప్రత్యేక బస్సులు నడపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికిగాను డిపో మేనేజర్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రత్యేక బస్సులు కోరుకునేవారు..తిరుపతి డిపో మేనేజర్ (9959225670),అలిపిరి డిపో మేనేజర్ (9959225671), తిరుమల మేనేజర్ (9959225672), మంగళం డిపో మేనేజర్ (7893723453),డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (9959225662) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.





## ఘనంగా దివంగత మాజీ ఎంపీ బల్లి జయంతి

**గూడూరు, మేజర్‌న్యూస్:** దివంగత మాజీ ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు 68వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం గూడూరు టవర్ క్లాక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గూడూరు నియోజకవర్గంలో చేసిన సేవలను పులవురు కీర్తించారు. ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ తండ్రి దుర్గాప్రసాద్ అడుగు జాడల్లో పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు వాకాటి ప్రభాకర్‌రావు, చిల్లకూరు జెడ్పీటిసి మన్నెం శ్రీనివాసులు,మాజి అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్లు, పేటేటి చంద్రనీల్, కటికల సురేష్, సంజీవనాయుడు, రమేష్, సుబ్బారావు, బ్లి బెనర్జీ, మాధురి, సునీల్, చిన్నా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ పార్క్‌లో పారిశుద్ధ్యం కరవు !

**- గాయాలపాలు అవుతున్న చిన్నారులు**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణం లోని పురపాలక సంఘం పరిధి 28 వవార్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీ రైల్వే స్టేషన్ సమీపంలో వున్న మహాత్మా గాంధీపార్క్‌లో సమస్యలు తిష్ట వేసాయి. పార్కు చుట్టు పక్కల ముళ్ళ పొదలతో దర్శనమిస్తున్నాయి. క్రీడా పరికరాలు మూల పడ్డాయి. ఈ క్రీడా పరికరాలతో ఆటలు ఆడే చిన్నారులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ వున్నారు. ఈ పార్కును 2018 లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి సుమారు 65 లక్షలు అమృత పథకం కింద ఏర్పాటు చేశారు. నేడు ఈ పార్కు దుస్థితికి చేరినా పట్టించుకునే నాథుడు కరువైయ్యారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో స్థానికులు ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తోందని పలువురు వాపోయారు. అలాగే పార్కు మొత్తం వర్షం నీరు వెళ్లే మార్గంలేకపోవడంతో గ్రౌండ్ మొత్తం పాచి పట్టి నడిచే వీలు లేకుండా ఉందని వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి మహాత్మాగాంధీ పార్కులో మరమ్మతులు చేపట్టాలని, తుప్పు పట్టిన ఆట వస్తువులు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు : వ్యవసాయ అధికారి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** రైతులు తమ వ్యవసాయ పొలంలో తక్కువ పెట్టుబడిని పెట్టి అధిక లాభాలు పొందవచ్చునని వెదురుకుప్పం వ్యవసాయ అధికారి వనిత అన్నారు. మండలం లోని సంతబైలు, మొండి వెంగనపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబ డులు పెట్టిఎక్కువ దిగుబడిన సాధించి తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. అనంతరం రైతు పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## పుట్టలమ్మ ఆలయంలో ఘనంగా శరనవరాత్రుల ఉత్సవాలు



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** కరకంబాడిలో శ్రీ కట్ట పుట్టాలమ్మ ఆలయంలో శ్రీదేవి శరణ నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గురువారం తొలి రోజు అమ్మవారికి విశేష అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కుర్రకాలవ వాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగానే శ్రీ దేవీశరణ నవరాత్రులను నిర్వహిస్తున్నామని అన్నారు. తొలి రోజు విశేషమైన అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 9 రోజులు అవతారంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తుందని కావున భక్తులు అమ్మవారి దర్శించుకోవాలని తెలిపారు.

## రామచంద్ర యాదవ్ వ్యాఖ్యలను ఆహ్వానిస్తున్నాం...

**-టీటీడీ డెయిరీ ఏర్పాటు చేస్తే సహకరిస్తాం**

**-తిరుమల యాదవ సంఘం అధ్యక్షుడు శీను యాదవ్**



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం వారు శ్రీవారి లడ్డూల తయారీలో వినియోగించే స్వచ్ఛమైన ఆవు నెయ్యి కోసం స్వంతంగా డెయిరీ ఏర్పాటు చేస్తే.. తాను వెయ్యి దేశీ ఆవులను ఏర్పాటు చేస్తానని, అలాగే ఇతరుల నుండి లక్ష ఆవులను టీటీడీ గోశాలకు ఇప్పించేలా చేస్తానని "భారత చైతన్య యువజన" పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ టీటీడీకి మాటిచ్చారు. ఆయన వ్యాఖ్యలను యాదవ సమాజం మొత్తం ఆహ్వానిస్తునట్లు తిరుమల యాదవ సంఘం అధ్యక్షుడు శీను యాదవ్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి విషయంలో గత 20 రోజుల నుంచి ప్రభుత్వ, ప్రతిపక్ష నేతలు విమర్శ, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని కొందరు పీఠాధిపతులు, స్వామీజీల ఆశీర్వాదంతో సనాతన హిందూ ధర్మం అనేది.. ఒక మతం కాదు.. యావత్ ప్రపంచం ఆచరించదగిన ఒక విధానం అని తెలియజేస్తూ బిసివై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పుంగనూరు నుండి తిరుమల వరకు గోవింద మాలతో పాదయాత్ర చేస్తూ రావడం జరిగిందన్నారు. అలిపిరి నుండి తిరుమల వరకు మెట్ల మార్గాన రావడమే కాకుండా మెట్లకు పూజోత్సవం చేయడం ఆయనకు శ్రీవారిపై ఉన్న అచంచల భక్తికి నిదర్శనం అన్నారు. దర్శనానంతరం టీటీడీ గోశాలను ఆయన దర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీ స్వంతంగా డెయిరీ ఏర్పాటు చేస్తే..తనవంతుగా 1000 గోవులను, ఇతరుల నుంచి లక్ష గోవులను సమకూరుస్తానని టీటీడీ యాజమాన్యానికి చెప్పడం అభినందించదగ్గ విషయం అన్నారు. టిటిడి వారు ఒక అడుగు ముందుకేసి స్వామి వారి లడ్డూలకు ఎంత మేరకు నెయ్యి అవసరమో, ఎంత మేరకు పాలు పెరుగు అవసరమో అంచనా వేసి దానికి తగ్గట్టుగా ఒక డెయిరీ ఏర్పాటు చేయాలన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి రాష్ట్రవ్యాప్తంగా కాకుండా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు ఉన్నారు. ఎలాగైతే అయోధ్యలో రామ మందిరానికి భక్తులు తలా ఒక ఇటుక విరాళంగా అందించారో అదేవిధంగా డెయిరీ ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్క శ్రీవారి భక్తుడు తమ వంతుగా ఎంతో కొంత వివిధ రూపాలలో సహకారం అందిస్తారని స్పష్టం చేశారు. టీటీడీ వారు తమ యాదవులను కూడా అందులో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ విషయంపై టిటిడి ఈవో, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి ఒక నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తిరుపతి యువజన విభాగం అధ్యక్షుడు రమణ యాదవ్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయ ప్రాకారం నిర్మాణం విషయంలో కానీ,ఆలయ ప్రధాన ద్వారం తెరిచేటప్పుడు కానీ, అలాగే గుడి తలుపులు మూసేటప్పుడు గానీ తొలి, చివరి దర్శనం యాదవులకు కల్పించే సాంప్రదాయం ఇప్పటికీ ఉందన్నారు. యాదవ కులానికి ప్రత్యేక అయినటువంటి శరభయ్య యాదవ్ విగ్రహాన్ని అలిపిరిలో ఏర్పాటు చేయడానికి మీ వంతు కృషి చేయాలని తమ యాదవ సమాజం రామచంద్ర యాదవ్ కు తెలియజేయడం జరిగిందన్నారు. టిటిడి యాజమాన్యం కూడా విగ్రహ ఏర్పాటుకు తగిన ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో చంద్రయాదవ్, మాసుమయ్య, మహేష్ యాదవ్, చంగల్రాయులు, ధన తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టపాసుల అంగళ్లకు అనుమతి ఇవ్వరాదు



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణంలో దీపావళి పండుగ నిమిత్తం టపాకాయలు అమ్మటానికి వ్యాపారస్తులు రెడీ అవుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పర్మిషన్ ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం వ్యతిరేకిస్తుందని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షుడు జాకీర్ డిమాండ్ చేశారు. విజేందర్భంగా గురువారం శ్రీకాళహస్తి పట్టణ తహసిల్దార్ లక్ష్మీ నరసింహారావుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాకీర్ మాట్లాడుతూ కళాశాల చుట్టూ వంద పడకల గవర్నమెంట్ ఆసుపత్రి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్న సంక్షేమ హాస్టల్స్. ఎంజీఎం స్కూల్. కాలేజీ. అన్నా కాంటీన్, కరెంటు సబ్ స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లు ఉన్నవి. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ విషయం అధికారులకు తెలిసి కూడా వ్యాపారస్తు ఇచ్చే లంచాలకి తలవంచి పర్మిషన్లు ఇస్తున్నారు. దీనిపై గతంలోనే పిడిఎసుగా మేము వ్యతిరేకిస్తూ ఆందోళన కూడా చేశాము. అయినా అధికారులు మొండిగా ఇస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా మీరు స్పందించి, ఊరికి దూరంగా ఉన్న ఖాళీ స్థలంలో పర్మిషన్లు ఇవ్వాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. లేదంటే ఈ విషయమై మేము విద్యార్థులతో విద్యార్థి సంఘాలతో కలిసి జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నాము. మీరు విద్యార్థులు, ప్రజలు రక్షణని దృష్టిలో పెట్టుకొని టపాకాయల అంగళ్లకు జూనియర్ కళాశాలలో పర్మిషన్ ఇవ్వకూడదని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మణికంఠ, రిజ్వాన్,తదితరులు పాల్గున్నారు.

## పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేద్దాం

**-సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి**



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** ప్రభుత్వ సహకారంతో గంట వారి పల్లి పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని గంట వారి పల్లి సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జక్కిదొన సచివాలయంలో మన పంచాయితీ మన సాధికారిత గ్రామసభ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముందు జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరంసర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ గంటా వారి పల్లి పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడానికి ప్రజల సహకారం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, పంచాయతీకి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రభుత్వ సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో గంటా వారి పల్లి మాజీ సర్పంచ్ రాజారెడ్డి, గంటా వారి పల్లి తెలుగు యువ నాయకుడు బండి విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి నాయకుడు వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాబు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## దసర సంబరాల్లో ఘర్షణ : ముగ్గురికి గాయాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరులో జరిగిన ఆంజనేయస్వామి జెండా ఉత్సవంలో ఘర్షణ చోటు చేసుకుంది. బుధవారం రాత్రి జెండా ఉత్సవం సందర్భంగా పోకీరల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పట్టణంలో పలు చోట్ల అర్ధరాత్రి జండాల ఉత్సవాల్లో జరిగిన ఘర్షణల్లో ముగ్గురు యువకులను ప్రత్యర్థులు కత్తులతో పొడిచారు. ఈ కత్తి పోట్లలో యశ్వంత్, హరీష్ , అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. కత్తిపోట్లకు గురైన యువకులకు నిందితులకు మధ్య పాతకక్షలు ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డిఎస్పి వివి రమణ్‌కుమార్, పట్టణ సిఐ శేఖర్‌బాబు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## రోగులపట్ల ప్రేమానురాగాలు చూపాలి

**- ఆసుపత్రి సూపరిటెండెంట్ మమతా రాణి**



**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక ఏరియా ఆసుపత్రి నందు గురువారం నర్సులతో ఆసుపత్రి సూపర్ రెండెంట్ మమతా రాణి, ఆర్ఓ శారద, సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు పై ప్రేమానురాగాలు చూపాలని ఆమె తెలిపారు. మీరు రోగులతో మాట్లాడే విధానంతోనే జబ్బు నయమవుతుందన్నారు. రోగులు వచ్చిన వెంటనే మీరు నెమ్మదిగా వారిని కూర్చోబెట్టి వారితో మాట్లాడితే వారు సంతోషపడతారన్నారు. డ్యూటీ సమయంలో ఉన్నప్పుడురోగులపై కసరకుండా మాట్లాడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి గతంలో 50 పడకుల ఉన్న దానిని 100 పడకులకు పెంచడం జరిగిందన్నారు. అందుకు తగినంత సిబ్బంది కూడా అవసరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నర్సులు తదితరులు పాల్గొన్నారు.

## లద్దిగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంపై విచారణ



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని రెండు ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు నలుగురు పనిచేస్తున్నారు. లద్దిగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సరైన భవనం లేక ప్రస్తుతం అద్దెభవనంలో నడుస్తుంది.ఐతే అద్దెచెల్లించ డానికి సరైన ఫండింగ్ లేక,ఆసుపత్రి మూతపడే పరిస్థితికి వచ్చినది.అంతే కాకుండా అక్కడ పనిచేస్తున్నటువంటి సిబ్బంది ఎటువంటి ముందస్తు శలవులు లేకుండా విధులకు గైరహాజరౌతున్నాని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పిర్యాదు అందినదని ఈ విషయం పైన గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతు రావు విచారణకు చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లద్దిగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వ భూమికేటాయించినదని, అలాగే లద్దిగం గ్రామపంచాయతీ సర్పంచ్ కృష్ణారెడ్డి చొరవతీసుకొని, గ్రామస్తులతో మాట్లాడి,గ్రామం లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం లో ఆసుపత్రిని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి వైద్యులు,లద్దిగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోటమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**కోట, మేజర్‌న్యూస్:** కోట గ్రామంలోని గ్రామదేవత కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మొదటి రోజు మహాకాళి అహంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈనెల 12వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారికి పల్లకి సేవ, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోట గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాది విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

## విత్తన శుద్ధితో రైతులకు బహుళ ప్రయోజనాలు

**- వ్యవసాయ శాఖ అధికారిణి దీప**



**వాకాడు, మేజర్‌న్యూస్:** వ్యవసాయంలో ప్రధానంగా విత్తన శుద్ధితో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని వాకాడు మండల వ్యవసాయ అధికారిణి దీప రైతులకు సూచించారు. మండలం లోని నెల్లిపూడి గ్రామ సచివాలయం వద్ద గురువారం పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఎరువులు, నీటి యాజమాన్యం, కలుపు మొక్కలు నివారణ తదితర వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విదంగా పశువర్ధక శాఖ సహాయక సంచాలకులు డాక్టర్ రమణయ్య సీజనల్ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించి, చికిత్స విధానాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శక్తి పీఠంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసి ఉన్న శ్రీ శక్తి పీఠంలో గురువారం భక్తిశ్రద్ధలతో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు అంకురార్పణ వైభవంగా ప్రారంభమయ్యాయి. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వరానంద మహాభారతి స్వాములు ఆధ్వర్యంలో పీతదేశ్వరి శ్రీ రమ్య నంద భారతి స్వాములు అమ్మవారికి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి శ్రీ షోడశీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తి పీఠం ఆలయం వ్యవస్థాపకులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈశ్వరయ్య కాలనీ యానాదులకు పక్కా గృహాలు

**- జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్**



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి పట్టణం కొత్త కోనేరు పూసల వీధి వద్ద ఉన్న ఈశ్వరయ్య కాలనీ శాఖ సమావేశం పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం వచ్చాక విపరీతంగా దళిత గిరిజన లపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు ఉచితంగా బస్సు సౌకర్యం గ్యాస్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు ఈశ్వరయ్య కాలనీ యానాదులు ఇండ్లు నిర్మాణం చేసి 50 సంవత్సరాలుపై కావస్తున్న ఇండ్లన్నీ స్లాబ్ ఊడే పైన పడుతున్నాయని ప్రమాదం జరిగే స్థాయికి ఇల్లన్ని నాసిరకంగా ఉన్నాయని పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఇంటి పన్ను మాత్రం ప్రతి నెల కడుతున్నారని వారికి సరైన మౌలిక సదుపాయాలు కూడా లేవని మండిపడ్డారు ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి ఈశ్వరయ్య యానాది కాలనీలను అభివృద్ధి చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపట్టమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య. బిల్డింగ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీరాములు. వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి ఎం శివకుమార్. ఏఐటియుసి ఏరియా కార్యదర్శి వైయస్ మనీ. ముని. గంగమ్మ. మునెమ్మ. శుభ రత్నమ్మ. గోపాలు. అనురాధ. తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిపై ఉన్న ప్రేమ సీమపై లేదా.?

**- తిరుపతిలో ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటుచేయాలి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమరావతిపై చూపుతున్న ప్రేమ రాయల సీమ ప్రాంత ప్రజలపై లేదా అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఏఐఎస్ఎఫ్ నేతలు సూటిగా ప్రశ్నించారు. బైరాగ పట్టెడ లోని జె ఎస్ కె భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నేతల సమావేశం గురువారం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్రం అనేక సవాళ్లు ఎదుర్కొంటుందని, ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా ఆంధ్ర ప్రదేశ్‌కు అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికల సమీప సమయంలో క్యాబినెట్ సమావేశం నిర్వహించి తిరుపతిలో డాక్టర్ బిఆర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు



చేయాలని తీర్మానం చేశారు. అయితే అధికారం చేపట్టిన కూటమి ఇంతవరకు దాని గురించి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రలో ఎన్నో విశ్వావిద్యాలయాలు ఉన్నప్పటికి, విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీ వైపు ఆసక్తి చూపుతున్నారు. ఏపీ విద్యార్థులు తమ సిబ్బంది పట్ల తెలంగాణ లోని యూనివర్సిటీ అధికారులు సవాత తల్లి ప్రేమ చూపుతున్నప్పటికి 2023 ౹2024 విద్య సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో 12000 మంది విద్యార్థులు చేరారు. మొత్తం అన్ని కోర్స్ కలిపి 35000 మంది రోల్స్ ఉన్నారు. అయితే నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఓపెన్ యూనివర్సిటీని అమరావతికి తరలించి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం అమరావతిని అభివృద్ధి చేస్తే రాయలసీమలో ఉన్న విద్యార్థులు పరిస్థితి అంధకారంగా మారుతుందాదన్నారు. కావున తిరుపతి లోనే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఓపెన్ చేయాలని డిమాండ్ చెసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు నవీన్, ప్రవీణ్, జిల్లా నాయకులు ఓం రాజ్, వినయ్, హరి, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**సూళ్లూరుపేట, మేజర్ న్యూస్:** ఆంధ్ర,తమిళ నాడు రాష్ట్రల ఆరాధ ధైవం సూళ్లూరుపేట పట్టణం ప్రాంతంలో కాళంగి నది తీరాన వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం నుండి అంగరంగ వైభవముగా ప్రారంభించారు. ఆలయ సహాయక కమిషనర్ ప్రసన్న లక్ష్మి నేతృత్వంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఉదయం అమ్మణ్ణి ఎదుట కలిశా స్థాపన చేశారు. మంగళవాయిద్యాలతో కాళంగి నది లోని పవిత్ర జలాలను ఆలయం వద్దకు తీసుకు వచ్చి కలిశాలలో నింపి పూజలు ఘనంగ చేశారు,ఈ పూజల్లో భాగంగా వేదపండితులు కలిశాలలోకి నవదుర్గలను ఆవాహన చేసి హారతులిచ్చారు, దసరా సందర్భంగా అమ్మణ్ణి చెంత అఖండ జ్యోతిని వెలిగించి ఉంచారు, ఈ పూజల్లో ఉభయదాతలు బీరక రాంబాబు దంపతులు పాల్గొన్నారు,

**నేటి నుంచి ఆలయంలో దసరా ఉత్సవాలు....**

శ్రీ బెంగాళమ్మ ఆలయంలో 10 రోజులు పాటు దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ ప్రసన్న లక్ష్మ తెలిపారు ఉత్సవాలకు సంబందించి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు ప్రతి రోజు పట్టణ గ్రామీణ ప్రాంతాల నుండి అమ్మణ్ణ కి భక్తులు సారెను సమర్పించే విధంగ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు భక్తులకు ప్రతి రోజు పలు రూపాల్లో అమ్మణ్ణిని దర్శించు కొనే అవకాశం ఉందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



## కావలి వారి పల్లి పంచాయతీలో గ్రామసభ



**తిరుపతిరూరల్, మేజర్ న్యూస్:** 25 -26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కావలి వారి పల్లి పంచాయతీలో పనులు గుర్తించి ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు సావిత్రి ప్రభాకర్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా గురువారం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం సంబంధించి గ్రామసభ నిర్వహించారు. అనంతరం పనులు గురించి గ్రామ సభ నిర్వహించడం జరిగింది. గ్రామ సభలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో గాను రైతులకు పంచాయతీలో ఏ ఏ పనులు కావాలో గుర్తించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనిచేసుకోవడానికి పనులు గుర్తించడం జరిగింది. ఈ గ్రామ సభలో సర్పంచ్ చెంగల్ రాయులు. సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఉపాధి కూలీలు గ్రామ ప్రజలు హాజంయ్యారు.

## కెనమాకులపల్లిలో ఉపాధి హామీ పథకం గ్రామసభ

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కెనమాకులపల్లి గ్రామ పంచాయతీ నందు గురువారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏవి జయరాం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2025-26 కు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు, వార్షిక ప్రణాళిక తయారీ గురించి గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో కుప్పం నియోజకవర్గం ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ రైతుల పొలాలు అభివృద్ధి పనులు,గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులు, గ్రామ మౌలిక వసతులు సిసి రోడ్లు, అంగన్వాడీ భవనాలు, డ్రైనేజీలు నిర్మాణ పనులు గ్రామస్థాయిలో ఈ నెల అంతా గుర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఈడుగ రమేష్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రాధాకృష్ణ, మాజీ ఎంపిటిసి కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ జైచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రూప,ఉపాధి హామీ కూలీలు,సచివాలయ సిబ్బంది,గ్రామస్తులు,రైతులు పాల్గొన్నారు.

# గతం కన్నా మిన్నగా శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

**టీటీడీ ఈఓ జె.శ్యామలరావు**

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి ఈవో శ్యామలరావు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం టిటిడిలోని అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం ఈఓ, అదనపు ఈ ఓ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహన సేవ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ విశేష ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తకోటికి టీటీడీ అనేక ఏర్పాట్లను చేసింది. అక్టోబరు 4న ముఖ్యమంత్రి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అదేవిధంగా



అక్టోబర్ 5వ తేదీ ముఖ్యమంత్రి తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున రూ.13.45కోట్లతో నూతనంగా అత్యాధునిక పరికరాలతో నిర్మించిన వకుళ మాత కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోజుకు 7లక్షల లడ్డూలను నిల్వ ఉంచా మన్నారు. భక్తుల సౌకర్యార్థం లడ్డూ కౌంటర్లను 2023లో 54 ఉండగా 2024లో 65, అంటే 11అదనంగా ఏర్పాటు చేశామన్నారు. వయో వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామని, బ్రేక్ దర్శనం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితమన్నారు. గరుడసేవ రోజు 8న బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేశామన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1.32లక్షల రూ.300 దర్శనటికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. గరుడ వాహనాన్ని సాయంత్రం 6.30గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా రాత్రి 11 గంటల వరకైనా నెమ్మదిగా ముందుకు తీసుకెళతామన్నారు. బయట వేచి ఉండే భక్తులు తమవంతు వచ్చే వరకు సంయమనంతో వేచి ఉండి భద్రతా విభాగం నిబంధనలు పాటించాలన్నా రు. భక్తుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకలను రద్దుచేశామన్నారు. పార్కింగ్‌కి సంబంధించి తిరుపతి లోని అలిపిరి పాతచెక్‌పాయింట్ వద్ద రెండు వేల టూవీలర్లు, వినాయక్‌నగర్ క్వార్టర్స్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, భారతీయ విద్యాభవన్, దేవలోక్‌ల వద్ద ఉన్న గ్రౌండ్‌లలో 4వీలర్లు, అదనంగా శ్రీవారి మెట్టు వద్ద కూడా పార్కింగ్ ఏర్పాట్లు చేశామని, తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాల నుంచి తిరుమలకు వెళ్లేలా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటుచేశామన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో దాదాపు 3 వేల రౌండ్ ట్రిప్పుల ద్వారా దాదాపు 3లక్షల మందిని తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 7నుండి రాత్రి 1గంట వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు అందిస్తామన్నారు. 3 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తామని, భక్తుల కోసం పులిహోర, టమోటా బాత్, బిసిబెళా బాత్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. వాహనాలపై చిల్లర నాణేలు విసరవద్దని మరొకసారి భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**చక్రస్నానం ఏర్పాట్లు...** శ్రీవారి పుష్కరిణి స్నానం మోక్ష దాయకమని, దీనిమహత్యం రోజంతా ఉంటుంది. కావున ఒకేసారి అందరూ పుష్కరిణి స్నానానికి ప్రయత్నించవద్దన్నారు. సంయమనంతో వ్యవహరించి స్నానమాచరించవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం. భక్తులు పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు, తిరిగి వెలుపలికి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశాం. భక్తుల భద్రత కోసం గజ ఈతగాళ్లతోపాటు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, బోట్లను అందుబాటులో ఉంచాం. ఈ సమావేశంలో జేఈఓలు గౌతమి, వీర బ్రహ్మం, సివిఎస్‌ఓ శ్రీధర్,సి ఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథంలు పాల్గొన్నారు.

# శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన విష్వక్సేనులవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు.



**విశిష్టత...** వైఖానస ఆగమంలో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. విత్తనాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం.

**సూర్యాస్తమయం తరువాతే...** మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే సూర్యుడు అస్తమించిన తరువాతే అంకురార్పణ నిర్వహిస్తారు. జ్యోతిష శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం చంద్రుడిని 'సస్య కారక' అంటారు. ఈ కారణంగా పగటివేళ అంకురాలను ఆరోపింపచేయడం తగదు. సాయంత్రం వేళ మంచి ముహూర్తంలో అంకురార్పణ నిర్వహిస్తారు.



అంకురార్పణంలో పలు పవిత్ర విత్తనాలు నాటడం తెలిసిందే. అంకురార్పణంలో నాటే విత్తనాలు బాగా మొలకెత్తుతాయి. విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా నిర్వహించబడతాయి.

**అంకురార్పణ క్రమం...** విత్తనాలు నాటేందుకు పాలికలు అనే మట్టి కుండలను వినియోగిస్తారు. యాగశాలలో ఈ మొత్తం కార్యక్రమం నిర్వహిస్తారు. అత్రి అనే మహర్షి తన 'సముర్తార్చన అధికరణ' అనే గ్రంథంలో అంకురార్పణ క్రమాన్ని రచించాడు. అంకురార్పణ జరిగే రోజు మధ్యాహ్నం వేళ విత్తనాలను కొత్త పాత్రలో నీటిలో నానబెడతారు. అంకురార్పణ నిర్వహించే ప్రదేశాన్ని ఆవు పేడతో అలంకరిస్తారు. ఇక్కడ బ్రహ్మపీఠాన్ని ఏర్పాటుచేస్తారు. ఆ తరువాత మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానిస్తారు. ఆ తరువాత భూమాతను ప్రార్థిస్తూ పాలికలను మట్టితో నింపుతారు. చంద్రుడిని ప్రార్థిస్తూ అందులో విత్తనాలు చల్లి నీరుపోస్తారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తారు. ఈ మొత్తం కార్యక్రమం వేదమంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ సాగుతుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీదర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐ విజయ్ కుమార్ బదిలీ

**సొంత జిల్లాకి బదిలీపై వెళుతున్న విజయ్ కుమార్‌కి సహచరుల అభినందనలు**

**అనుకున్న లక్ష్యాన్ని చేదించడంలో నైపుణ్యత కల్గిన అధికారిగా గుర్తింపు పొందిన టాస్క్ పోర్స్ ఎస్సై విజయ్ కుమార్**

**గూడూరు, మేజర్‌న్యూస్:** టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐగా విజయ్ కుమార్ గూడూరులో విధులు నిర్వహిస్తూ గురువారం తన సొంత జిల్లా పుట్టపర్తి సత్యసాయి జిల్లా కొడికొండ చెక్‌పోస్ట్‌కు బదిలీ అయ్యారు. ఏడాది క్రితం కర్నూలు జిల్లా నుండి గూడూరు టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించడంతోనే వివిధ నేర ధోరణలు, మాదకద్రవ్యాలు కార్యకలాపాలను పరిశోధించడం వాటిని నియంత్రించి నివారించడంతో ఉన్నత అధికారుల నుండి ప్రశంసలు అందుకున్నారు. తన సిబ్బందితో కలిసి బృందంగా ఏర్పడి లక్ష్యాన్ని చేదించడంలో విజయం సాధించి పలు నేరాలను వెలుగులోనికి తీసుకువచ్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా కొడికొండ చెక్ పోస్ట్ ఎస్‌ఐగా విధులు నిర్వహించేందుకు వెళుతున్న విజయ్ కుమార్‌కి టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది, గూడూరు ప్రజలు అభినందనలు తెలిపారు.

**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

**వెంకటగిరి నియోజకవర్గం :**

1. డక్కిలి, 2.బాలాయపల్లి

**సత్యవేడు నియోజకవర్గం :**

1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం, 4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

**చంద్రగిరి నియోజకవర్గం :**

1.పాకాల, 2.చిన్న గొట్టికల్లు, 3.ఎర్రవారి పాలెం

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

## శైల పుత్రిదేవి అలంకరణలో అమ్మవారు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు సందర్భంగా ఆలయంలోని. అమ్మవారి గర్భాలయం ఎదుట బొమ్మలు కొలువుని ఏర్పాటు చేసి శైలపుత్రి దేవి అలంకారంలో అమ్మవారిని బొమ్మల కొలువులు మధ్య కొలువు తీసి విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి. దేవస్థానం సూపర్డెంట్ అండ్ సి ఎస్ ఓ నాగభూషణ యాదవ్. టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్. పిఆర్ఓ రవి. ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని పుదిపట్లలో వెలసివున్న వైష్ణవీ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు.అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు.అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఆమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలమ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వర స్వాముల భూములు భహిరంగ వేలం

**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలం లోని గోసల కురప్పల్లి లో వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి వారి భూములను సోమవారం 07-10-2024 నా వేలం వేయనున్నట్లు గ్రూపు ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి కె.కమలా కర్ ఒక ప్రకటనలో తెల్పారు.స్వామివారి భూముల వేలం పాటలో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు ధరావత్తు చెల్లించి భహిరంగ వేలం లో పాల్గొనవచ్చును.వేలం పూర్తైన వెంటనే ఒక సంవత్సర కాలానికి గుత్త చెల్లించవలయును. దేవస్థానమునకు పాత బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనరాదని,ఈ వేలం పాట మూడు సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది.అనగా 2024-25,2025-26,2026-27 వరకు గుత్తకు ఇవ్వబడును.హెచ్చు పాటదారునికి తప్ప మిగతావారికి ధరావత్తు వాపసు ఇవ్వబడును.భూములు ప్రస్తుతం ఉన్నపరిస్థితులలో అలాగే గుత్తకు ఇవ్వబడును.హెచ్చుతగ్గులు ఉండవచ్చును.ఏ కారణం చేతనైనా ఈ వేలం పాటను నిలుపు దల చేయడం,వాయిదా వేయడం వంటి హక్కులను దేవాదాయ శాఖ కల్గిఉంటుందని ఆయన అన్నారు.వేలం వేయబడే భూములు వివరాలు సర్వే నెంబర్ 70/6 నందు 0.65 సెంట్ల తరి,152/1 నందు 3.32 సెంట్ల ఖుష్కి,156/4 నందు 11.00 ఎకరాల ఖుష్కి,406/13 నందు 1.35 సెంట్ల తరి గడ్డం వారిపల్లి కి చెందినది.ఉన్నాయని కావున వేలం లో పాల్గొనదలచిన వారు సోమవారం 07-10-2024 న ఉదయం పది గంటలకు కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయం వద్దకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ కిషోర్ కుమార్, సిబ్బంది హరిప్రసాద్ పాల్గొన్నారు.

## పిజె చంద్రయ్య శెట్టికి శ్రద్ధాంజలి

### - మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబెర్. ఆర్య వైశ్య అన్నదాన సత్రం చైర్మన్ పిజె. చంద్రయ్య శెట్టి స్వర్గస్థులయ్యారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబెర్. ఆర్య వైశ్య అన్నదాన సత్రం చైర్మన్ పిజె చంద్రయ్య శెట్టి పార్థివ దేహానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు యస్ సివి నాయుడు శ్రీకాళహస్తి ఆయన స్వగృహం గజమాలతో నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపి. ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో యస్ సివి నాయుడు, స్కిట్ కళాశాల మాజీ చైర్మన్ గురు దశరథన్. టీడీపీ పార్టీ తొట్టంబేడు మండల మాజీ అధ్యక్షులు గోగినేని భాస్కర్ నాయుడు. జానకి రామ్ నాయుడు. అంజూరు సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

## వీడ్కోలు సమావేశం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు పంచాయతీరాజ్ సబ్ డివిజన్ నందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గత 5 సంవత్సరాలు నుండి ఉన్నతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి బదిలీపై చిత్తూరు పి.ఆర్.ఐ సబ్ డివిజన్ బాదలి పై వెళ్లిన నవీన్ కుమార్ కు పెద్ద ఎత్తున వీడ్కోలు సమావేశం పలమనేరు నందునిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల నుండి ఇంజనీరింగ్ అసిస్టెంట్ పంచాయతీరాజ్ ఏఈలు శ్రీనివాస్, విద్యాసాగర్, ప్రస్తుత డి.ఈ మహేష్ కుమార్ తదితరులు పాల్గొని అతను పలమనేరు నందు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అతను చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏ.పీఎన్జీవో సంఘ ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, బాబు, రాజశేఖర్, పురుషోత్తం, ఇంతియాజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పెద్ద ఎత్తునతదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో అందరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలి

**- ఆదిశక్తి అమ్మవారి కృప కై ఆరాధన చేయండి**
**- దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ పిలుపు**



**తిరుపతిబ్యూరో మేజర్‌న్యూస్:** ప్రస్తుత పరిస్థితులలో భారతీయ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన విరివిగా పెరగాలని ఆదిశక్తి అమ్మ వారి కృపకై ప్రతి ఒక్కరూ ఆరాధన చేయాలని శ్రీ దివ్యజ్ఞానానందగిరి స్వామీజీ పిలుపునిచ్చారు గురువారం జీవకోన విజయపురం క్రాంతి నగర్ సర్కిల్లో గల శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా కలశ స్థాపన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా దివ్యజ్ఞానానందగిరి స్వామీజీ మాట్లాడుతూ ప్రజల్లో దైవ భావన పెరుగుతోందన్నారు ఆది శక్తి అమ్మవారు నవరూపాల్లో భక్తులను ఆశీర్వదిస్తూ రాక్షస సంహారం చేస్తూ భక్తులను కాపాడుతూ ఉంటుందన్నారు ప్రతి ఏటా ఆశ్రయ మాసంలో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో అత్యంత వైభవంగా జరగడం ఆనవాయితీగా వస్తుందన్నారు చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో వరుసగా గాయత్రీ దేవి అన్నపూర్ణాదేవి బాలత్రిపుర సుందరి దేవి లలితా త్రిపుర సుందర దేవి మహాలక్ష్మి దేవి సరస్వతి దేవి దుర్గాదేవి మహిషాసుర మర్దిని రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులను ఆశీర్వదిస్తుంది అన్నారు చివరగా విజయదశమి నాడు అమ్మవారు ఆదిశక్తి రూపంలో భక్తులను ఆశీర్వదిస్తుంది అన్నారు ఈ సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరుగుతాయన్నారు చౌడేశ్వరి దేవి సుప్రభాతం పంచామృతాభిషేకం అనంతరం అలంకార దర్శనం తదుపరి మంగళహారతి తీర్థప్రసాద వితరణ సర్వదర్శనం సాయం సంధ్య వేళ లలితా సహస్రనామ పారాయణం అమ్మవారికి ఊంజల సేవ అనంతరం మహా మంగళహారతి తీర్థ ప్రసాద వితరణతో పూజలు ప్రతిరోజు ముగుస్తాయన్నారు ఈ కార్యక్రమంలో దివ్యజ్ఞానానందగిరి స్వామీజీ తోపాటు తొకటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు ఎం బాబు ఆలయ కమిటీ ధర్మకర్తలు చెన్నకేశవులు వెంకటకృష్ణ ఎన్ ఎర్రయ్య చౌడయ్య లక్ష్మయ్య వెంకటస్వామి చంగల్ రాయులు ఆలయ పూజారి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీనివాసులు జన్మదిన వేడుకలు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిపారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు. కార్యకర్తలు అంజూరు తారక శ్రీనివాసులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అన్నదానం వస్త్ర పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు జన్మదిన పురస్కరించుకొని ఆయన స్వగృహంలో పలువురు పార్టీలకు అతీతంగా అంజూరుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు. టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఆధ్వర్యంలో జన్మదిన కేకును అంజూరు తారక శ్రీనివాసులు కట్ చేసి శుభాకాంక్షలు అందుకున్నారు. పట్టణం వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఏటీఎస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అంజూరు తారక శ్రీనివాసులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించి, వెంకటేశ్వర స్వామి చిత్ర మెమెంటోను బహుకరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేకును అంజూరు తారక శ్రీనివాసులు కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి అంజూరు తారక శ్రీనివాసులు అన్నదానాన్ని ప్రారంభించి పేదలకు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌లో రోగులకు బ్రెడ్డు బిస్కెట్లు. పండ్లను మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి అంజూరు తారక శ్రీనివాసులు పంపిణీ చేశారు. తదుపరి వంగవీటి రంగా విగ్రహానికి పుష్ప మాలలు వేసి అంజూరు తారక శ్రీనివాసులు నివాళులర్పించారు. తొట్టంబేడు మండలం శివనాథపాలెం గ్రామంలో వెలిసి ఉన్న అమ్మ ఆశ్రమంలో వృద్ధ మహిళలకు అంజూరు తారక శ్రీనివాసులు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు భూదేవి అంజూర తారక శ్రీనివాసులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, షేక్ సిరాజ్ భాష. పగడాల రాజు. కంట ఉదయ్ కుమార్. మగరాల గణేష్. సెన్నీరు కుప్పం శేఖర్. ఉత్తరాది శరవణ కుమార్. సాధన మొన్న రాయల్. బుల్లెట్ జై శ్యామ్. లీలా కుమార్. కొల్లూరు హరినాథ్ నాయుడు. సూరా వారి సురేష్. వేలూరు రమేష్. పసల కుమారస్వామి. పసల కృష్ణయ్య. పెరుమాళ్ చౌదరి. పత్తి మనీ. గోపి గౌడ్. మధు రెడ్డి. వరదరాజులు. సుబ్రహ్మణ్యం రెడ్డి. పూడి రవి. విజయ్ కుమార్ రెడ్డి. హరి. కుమార్. ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిపో సెక్రటరీ పసుపులేటి శ్రీనివాసకుమార్. అధ్యక్షుడు జి పురుషోత్తం. మురళి. కన్నప్ప. పట్టాభి. టి లింగమూర్తి. చంద్ర, ప్రసాద్. కిషోర్, రామకృష్ణ, శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ నాయకులు గౌరవ సలహాదారుడు చాంద్ భాషా. అధ్యక్షులు సుబ్రహ్మణ్యం. అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 30 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ మద్యం దరఖాస్తులు స్వీకరణపై ఎక్సేంజ్ సీఐ లావణ్య ఆధ్వర్యంలో గురు వారం విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్వైజర్ వాసుదేవా చౌదరి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి డివిజన్ లో 30 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 30 షాపులు నేపథ్యంలో. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో 12 షాపులు 65 లక్షల రూపాయలు డిపాజిట్, బుచ్చి నాయుడు కండ్రిగ ఐదు షాపులు 55 లక్షలు డిపాజిట్. కెవిపి పురం మూడు షాపులు. 55 లక్షలు డిపాజిట్, తొట్టంబేడులో మూడు షాపులు 55 లక్షల రూపాయల డిపాజిట్ , ఏర్పేడులో 65 లక్షల డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందని తెలియజేశారు, ఒకటవ తేదీ నుంచి 9 వతేదీ వరకు వారి వారి పోలీస్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తులు స్వీకరింపబడతాయని, ఈ డివిజన్ లో మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉన్నామని, మద్యం షాపులకు దరఖాస్తు వేస్తే దరఖాస్తు దారుడు ఈ కౌంటర్లో దరఖాస్తు చేసుకుంటే. 11వతేదీ తిరుపతి శిల్పారామంలో లక్కీ డ్రిప్ ద్వారా మద్యం షాపులు కేటాయించబడతాయని తెలియజేశారు. అప్లికేషన్ వేసేవారు రెండు లక్షల రూపాయలు రుసుము చెల్లించవలసి ఉంటుందని ఈ నగదు తిరిగి ఇవ్వబడదని తెలియజేశారు. మద్యం షాపుకు అప్లికేషన్ ఆన్లైన్ ద్వారా ఐన ఆఫ్లైన్ ద్వారా అయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.



## సుందరయ్య నగర్ లో..అండర్ డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలి



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** స్థానిక సుందరయ్యనగర్‌లో పొంగిపొర్లుతున్న అండర్ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ..స్థానికులతో కలిసి సుందరయ్య నగర్ లో సిపిఎం నేతలు గురువారం ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నగర కమిటీ సభ్యులు ఎం.నరేంద్ర,నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే.వేణుగోపాల్,పి.బుజ్జి మాట్లాడుతూ..సుందరయ్య నగర్‌లో అనేక వీధులలో అండర్ డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని,ప్రజలు నిత్యం చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు.వర్షం పడితే డ్రైనేజీ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.మునిసిపల్ అధికారులు సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత వర్షాకాలం సీజన్లో నిత్యం అండర్ డ్రైనేజీ పొంగడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశుద్ధ్యన్ని మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను కోరారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జై చంద్ర,పి.సాయి లక్ష్మి,నగర కమిటీ సభ్యులు ఎం.జయంతి, టి.రామకృష్ణ,ఆర్.మల్లికార్జున్ రావు, నాయకులు బాలాజీ,ఈశ్వరయ్య, లోకేష్, యూసఫ్, తంజావూరు మురళి, డివైఎఫ్ఐ నాయకులు సోము,పవన్ లతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** దేవీ నవరాత్రులు ఉత్సవాలలు సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వివిధ సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అర్చక స్వాములు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అనుబంధమైన కనకదుర్గమ్మ కొండమీద ప్రతిష్టించిన కనకదుర్గమ్మ అమ్మవారి అభిషేకంలో అధికారులు, ఉభయ దారులు పాల్గొన్నారు. కొండమీద వెలసిన అమ్మవారిని దర్శించుకోవడానికి గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో ఇచ్చేయడం ఆనవాయితీ. దీంతో ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సూచనతో ఇంజనీరింగ్ శాఖ అధికారులు చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు చలవ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, అన్నప్రసాదాలు నిరంతరం కొనసాగేటట్లు కొండమీద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గురువారం ఉదయం దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వాములు, ఏఈఓలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం బాలాజీ కాలనీ వద్ద వెలిసిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం, సాయి వ్రతం, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం దర్శించిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు, సాయంత్రం స్వామివారు చిత్రపటాన్ని పల్లకిపై ఊరేగించారు. భక్తులు కర్పూరహాలు గురించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లతా బాలాజీ, ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రాంశెట్టి రాజశేఖర్, ఉప కోశాధికారి చిరంజీవి రెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మ కొండపై దసరా ఉత్సవాలు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధం శ్రీ కనకాచలం శ్రీ కనకదుర్గమ్మ వారికి దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా గురువారం మొదటి రోజు అమ్మవారికి పలు రకాలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి దీప దూప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్. దేవస్థానం అధికారులు. సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన దుర్గమ్మ కొండ దసరా నవరాత్రు ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం కలిసి స్థాపన ప్రారంభం జరిగింది.
కార్యక్రమంలో ఈవో పాల్గొన్నారు.

## చిన్నారి అస్మియాను హత్య చేసిన నిందితులని కఠినంగా శిక్షించాలి





**పలమనేరు మేజర్ న్యూస్ :** పలమనేరు పట్టణం డిఎస్పీ కార్యాలయం వద్ద గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ సయ్యద్ ముబారక్ తన సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పుంగనూరు ఆరేళ్ల చిన్నారి అస్మియా అంజుమ్ ను హత్య చేసిన వారు మరియు చేపించిన వారు ఎంత పెద్ద వారైనా సరే వారిని కఠినంగా శిక్షించాలని పలమనేరు డి.ఎస్.పి ప్రభాకర్ను కోరినట్లు తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాల్సిందిగా కోరారు.

## సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి




**ఓజిలి, మేజర్‌న్యూస్:** సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ నాయకులు వైద్యులు డాక్టర్ దార.అంకయ్య అన్నారు. బుధవారం ఓజిలి మండల లోని కురుగోండ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సర్పంచ్ తిరుమల శెట్టి శ్రీ లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామ సభ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు వైద్యులు డాక్టర్ అంకయ్య,తెలుగుదేశం పార్టీ నేత కట్టంరెడ్డి.శ్రీనివాసులు రెడ్డి, పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా మంచి ప్రభుత్వం ఎందుకంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నప్పటికి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించుకుని అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని ఆయన అన్నారు.చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే మొగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, ఫింఛను రూ.4వేలకు పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటిన్లు పునరుద్ధరణలపై సంతకాలు చేశారన్నారు. వంద రోజుల్లో మంచి పాలనఅందించిన మంచి కూటమి ప్రభుత్వానికి జనం 'శతమానం భవతి' అంటూ దీవిస్తున్నారనిఈ ప్రభుత్వంలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తేదేపా సీనియర్ నాయకులు వైద్యులు డాక్టర్ అంకయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కట్టం రెడ్డి.శ్రీనివాసులు రెడ్డి,పంచాయతీ కార్యదర్శి రమేష్, సర్పంచ్ తిరుమల శెట్టి. శ్రీలక్ష్మీ, సుబ్రహ్మణ్యం, మనోహర్, భాలరక్ష బాల సదస్సు సంస్థ ప్రతినిధులు కోటేశ్వరరావు, క్రిష్ణయ్య, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మణి, వెంకటేశ్వర్లు, బి.రవి,ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఓజిలి తేదేపా నాయకులు



**లిఓజిలి మేజర్ న్యూస్‌బీ** ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం సీఎం నారా చంద్రబాబునాయుడు ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులు , మాజీ ఎంపీ నెలవలసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నెలవల రాజేష్,ఓజిలి మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు, గున్నం సేవా ట్రస్ట్ అధినేత తేదేపా నాయకులు గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖలీల్ భాషా తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనంతరం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాజీ ఎంపీ నెలవలసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఓజిలి మండలం లోని పలు సమస్యలను తెలియజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు ఏం ఎలా ఉన్నారు అంటూ ఆప్యాయంగా పలకరించారు. మండలాన్ని అందరూ కలిసికట్టుగా పనిచేసే మండలాన్ని అభివృద్ధి చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విజయ్ కుమార్ నాయుడు , గున్నం రెడ్డి మధుసూదన్ , ఖలీల్ భాషా సీఎం నారా చంద్రబాబు నాయుడికి పలు సమస్యలను పరిష్కరించాలని వారికి తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూసమస్యలను పరి పరిష్కరిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వారి వెంట తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నెలవల రాజేష్ , మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు, గున్నం సేవా ట్రస్ట్ అధినేత తేదేపా నాయకులు గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖలీల్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా పోటీల్లో విద్యార్థులకు బహుమతులు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా - 2024 పోటీలలో శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తమ విద్యార్థినిలు రూ 13,000 నగదు బహుమతిని గెలుపొందడం గర్వకారణం అని ప్రిన్సిపల్ డాక్టర్.టి. నారాయణమ్మ తెలిపారు. కళాశాలలో గురువారం అభినందన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ 4 కిలోమీటర్ల పరుగు పందెంలో విద్యార్థులతో పోటీపడి గౌతమి మొదట సంవత్సరం విద్యార్థి 5000 ప్రథమ బహుమతి సాధించారన్నారు. వేస్ట్ టు ఆర్ట్, వేస్ట్ టు వండర్ విభాగంలో 8 మంది హోమ్ సైన్స్ విద్యార్థినులు 8,000/ల రూపాయల నగదు ద్వితీయ బహుమతిని సాధించారన్నారు. వీరు పనికిరాని వస్త్రాల నుండి డోర్ మాట్లను, వాటర్ బాటిల్లతో పూలకుండీలను, టిష్యూ కాగితాలతో పూల గుత్తులను, బంకమట్టితో ఆభరణాలను, మట్టి విగ్రహాలను తయారు చేశారన్నారు. ఆ ముక్కలపై దేవుని ప్రతిమలను, ఫోటో ఫ్రేమ్‌లను అద్భుతంగా తయారు చేశారన్నారు. విద్యార్థినులు సృజనాత్మకంగా చేసిన ఈ నైపుణ్య కళాఖండాలు పలువురిని ఆకర్షించిందన్నారు. ముమ్ముందు ఇలాంటి బహుమతులు మరిన్ని సాధించాలని ప్రిన్సిపాల్ విద్యార్థినులను ప్రోత్సహించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్. కృష్ణవేణి, డాక్టర్ .దివ్యవాణి, హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్. లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శోభ, డాక్టర్ వాణి ప్రశాంతి విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు



**పలమనేరు మేజర్ న్యూస్ :** పలమనేరు పాతపేట దుర్గా నగర్ కాలనీలో శ్రీ కనకదుర్గ దేవి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం గణపతి హోమంతో ప్రారంభం అయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహణ

**పలమనేరు మేజర్ న్యూస్ :** బజారు వీధిలో ఉన్న తపాలా కార్యాలయం వద్ద గురువారం తపాలా శాఖ నందు టార్గెట్స్ పేరుతో తపాలా సిబ్బందిని హింసించడం ఆపాలని ఎన్ ఎఫ్ పి ఈ, ఏఐజి డి ఎస్ యు, యూనియన్ పిలుపుమేరకు రెండవ దశ పోరాటం టార్గెట్ కు వ్యతిరేకంగా గురువారం నుండి ఐదవ తేదీ వరకు రెండవ దశ పోరాటంలో భాగంగా డివిజనల్ స్థాయిలో1000 మంది తపాలా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహించారు. సి పి ఎం జి ( ఏపీసిసెలే )కు ఈ మెయిల్ ద్వారా పోస్ట్ కార్డు ద్వారా నిరసనను తెలియజేశారు. ఏడవ తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు రెండు రోజులపాటు టార్గెట్ బహిష్కరిస్తూ సహాయ నిరాకరణకార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని డివిజన్లో ఒక్కరోజు మాస్ ధర్నాను అధిక సంఖ్యలో ఉద్యోగులు సెలవులు పెట్టిహాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్రటరీఅరుణ, ఎస్ పి ఎం తేజ, అస్లాం ఖాన్, గోవిందు, బాలసుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు.